సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



ఆందోళన బాటలో..

డిమాండ్ల సాధన కోసం ఆటోవాలాలు రేపు సమ్మె బాట పట్టనున్నారు.

వివరాలు 8లో ▸



తడిసిన ధాన్యం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం వల్ల ధాన్యం తడిసింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.2 /19.7

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తెల్లవారు జామున, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. తేమ ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా ఎంప్లాయిమెంట్ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మైత్రిప్రియ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు ప్రైవేట్ సంస్థల్లో 620 వివిధ రకాల ఉద్యోగాల కోసం ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 99485 68830, 95502 06227, 91753 05435 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం: ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజలకు ఆర్టీసీ పరంగా మెరుగైన సేవలు అందిస్తామని నూతన రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని రీజినల్ కార్యాలయంలో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేషన్ పరంగా మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పనితీరు బాగుందన్నారు. రీజియన్‌లోని అన్ని డిపోలు మంచి ఆదాయాన్ని సాధిస్తున్నాయని అన్నారు. మహాలక్ష్మి పథకంతో రీజియన్‌లో మహిళల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. పాత బస్సుల్లో ఏమైనా సాంకేతిక లోపాలు ఉంటే వెంటనే సరిచేసేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రీజియన్‌ను మరింత లాభాల్లోకి తీసుకెళ్లేలా ఆర్టీసీ ఉద్యోగులు కష్టపడి పనిచేయాలని కోరారు.

ఐదేళ్లలోపు చిన్నారులందరికీ టీకాలు



పాలమూరు: జిల్లాలో రూపొందించిన సూక్ష్మ ప్రణాళిక మేరకు ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు వేయాలని డీఎంహెచ్ఓ డా.కృష్ణ, డబ్ల్యూహెచ్ఓ రాష్ట్ర సర్వేలైన్స్ అధికారి మురారి అన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లకు గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో వ్యాక్సినేషన్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో టీకాల పంపిణీలో మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. ఐదేళ్ల పిల్లలను గుర్తించడంతో పాటు సకాలంలో టీకాలు అందేలా చూడాలన్నారు. నవజాత శిశువుల తల్లిదండ్రులకు టీకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యేక సర్వేలు నిర్వహించి, వ్యాక్సినేషన్‌లో తప్పిపోయిన పిల్లలను గుర్తించాలని తెలిపారు. అనంతరం డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధులు జోత్స్న, అజార్, డేవిడ్ అప్‌డేట్ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.పద్మజా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లు 20 శాతానికి పెంచాలి



పాలమూరు/దేవరకద్ర: రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లు 20 శాతానికి పెంచి, ఏబీసీడీలుగా విభజించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.పిడమర్తి రవి డిమాండ్‌చేశారు. గురువారం మహబూబ్‌నగర్, దేవరకద్రలో ఏర్పాటు చేసిన మాదిగల అసెంబ్లీ నియోజకవర్గాల సమ్మేళన సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. పంజాబ్‌లో అక్కడి ప్రభుత్వం 20 శాతానికి ఎస్సీ రిజర్వేషన్లు పెంచగా.. కర్ణాటక ప్రభుత్వం 17 శాతానికి పెంచిందని వివరించారు. రిజర్వేషన్ పెంచితే రాష్ట్రంలో ఉన్న మాల, మాదిగల మధ్య విభేదాలు తగ్గుతాయని అన్నారు. మాదిగల, మాల దామాషా ప్రకారం రిజర్వేషన్లు వస్తాయన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2శాతం ఉన్న అగ్రవర్ణ పేదలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించడం సాధ్యమైనప్పుడు.. జనాభాలో అత్యధికంగా ఉన్న దళితులకు దేశవ్యాప్తంగా 20 శాతం రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించిన మేరకు మాదిగలకు 14 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మంత్రివర్గ విస్తరణలో వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం అంతమవుతుందని, అది కేవలం కొందరు మంత్రి పదవి కోసం చేస్తున్న కృత్రిమ ఉద్యమం అని అన్నారు. సమావేశంలో మదనాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాక ప్రశాంత్, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్, నాయకులు రాయికంటి రాందాస్, సింగిరెడ్డి పరమేశ్వర్, సాయిబాబా, గోపాలకృష్ణ, బొరెల్లి సురేష్, యాదయ్య, దినేష్, రామలింగం, కాలె నరేందర్ ఉన్నారు.

48 గంటల్లో డబ్బులిచ్చుడు..

ఉత్తమాటే

25 శాతం కూడా పూర్తి కాలేదు..

జిల్లావ్యాప్తంగా వరి పండించిన రైతుల నుంచి 1,99,050 మెట్రిక్ టన్నుల **ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుంద**ని జిల్లా అధికారులు అంచనా **వేశారు. కేంద్రాలను ప్రారంభించి 51 రో**జులు అవుతున్నా కొనుగోళ్లు నెమ్మ**దిగా సాగుతోంది. అధికారుల అంచనా** ప్రకారం 25 శాతమే ధాన్యం సేక**రణ జరిగింది. 8,900 మంది రైతుల** నుంచి 47 వేల మెట్రిక్ టన్నుల **ధాన్యాన్నే కొనుగోలు చేశారు. ఇంకా 1,5**2,050 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని **కొనుగోలు చేయాల్సి ఉంది. ధాన్యం కొను**గోలు ప్రక్రియ పూర్తి కావడానికి **మరో నెల రోజుల సమయం పడుతుంద**ని అధికారులు తెలిపారు.



ధర్మాపూర్ రైతువేదిక కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుందర్‌రాజ్ (ఫైల్)

ధాన్యం డబ్బు జమకు తాత్సారం

- 8,900 మంది రైతుల నుంచి 47 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- ఇప్పటి దాక 6,500 మంది రైతులకు రూ.86 కోట్లు చెల్లింపు
- 2,400 మంది అన్నదాతలకు అందని నగదు
- కొనుగోళ్లు సైతం నెమ్మదిగా సాగుతున్న వైనం



ధర్మాపూర్ గ్రామ రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో ధాన్యాన్ని ఆరబోసిన రైతులు (ఫైల్)

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం డబ్బు చెల్లింపులో జాప్యం జరుగుతోంది. 48 గంటల్లో రైతులకు చెల్లింపులు చేస్తామన్న అధికారుల మాట వట్టిదేనని తేలిపోయింది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లావ్యాప్తంగా 189 కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో 1,94,936 వరిని సాగు చేసిన రైతులు ఈసారి తమ పంట దిగుబడులను అమ్ముకోవడం సమస్యగా మారింది. ఎక్కువ రోజులు పొలాల మీదనే వదిలేయలేక.. చేతికి వచ్చిన ధాన్యాన్ని రోజుల తరబడి దగ్గర పెట్టుకోలేక.. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర దక్కకున్నా.. చాలా మంది రైతులు నష్టానికే మిల్లర్లకు విక్రయించారు. టోకెన్ల పద్ధతిన అమ్మకాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం సైతం కొనుగోలు కేంద్రాల్లో నాణ్యమైన ధాన్యాన్ని సేకరిస్తోంది. కాగా.. ఇప్పటివరకు ధాన్యాన్ని ఆయా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకున్న రైతులకు వెనువెంటనే చెల్లింపులు జరగడం లేదు. దీంతో డబ్బుల కోసం ఎదురుచూడక తప్పడం లేదు.

■ ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లావ్యాప్తంగా డీఆర్‌డీఏ-ఇందిరాక్రాంతి పథం (ఐకేపీ), పీఏసీఎస్, మెప్మా, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో 189 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతులకు 48 గంటల్లో డబ్బులు చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. కొన్నేళ్లుగా ఇదే విధానం అమలవుతుంది. మొదట కొనుగోలు కేంద్రాలకు వెళ్లే రైతుల వివరాలను తీసుకుంటున్న నిర్వాహకులు.. ధాన్యం కొనుగోళ్ల పూర్తవ్వగానే వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు పంపిస్తున్నారు. ఆ వెంటనే సంబంధిత రైతు బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమవుతాయి. అయితే అప్‌లోడ్ ప్రక్రియ వెంటవెంటనే జరుగుతున్నా రైతుల బ్యాంక్ ఖాతాల్లో మాత్రం డబ్బు జమ కావడం లేదు. 48 గంటల్లో రైతులకు డబ్బు చెల్లిస్తామన్న ప్రభుత్వ ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు. అయితే రైతులకు డబ్బుల చెల్లింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి డబ్బును 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ప్రయత్నిస్తున్నా.. సాంకేతిక కారణాల వల్ల జాప్యం ఏర్పడుతుందని వారు చెబుతున్నారు.

ధాన్యం డబ్బు జమ కాలేదు



లాల్‌కోట గ్రామ సొసైటీకి నాలుగు రోజుల క్రితం 40 క్వింటాళ్ల వరి ధాన్యం విక్రయించా.. కానీ ఇప్పటి వరకు ధాన్యానికి సంబంధించి రూ.1.12 లక్షలు నా బ్యాంకు అకౌంట్‌లో జమ కాలేదు. అలాగే బోనస్ రూ.500లు కూడా రాలేదు. ధాన్యం విక్రయించిన వెంటనే డబ్బు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తే ఏ ఒక్క రైతు కూడా ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళ్లరు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే డబ్బులు ఎప్పుడు పడతాయో తెలియకనే వ్యాపారుల వైపు మొగ్గు చూపాల్సి వస్తోంది.

– చంద్రయ్య, రైతు, ఫర్దీపూర్, చిన్నచింతకుంట మండలం

రైతులు డాక్యుమెంట్లు ఇవ్వట్లేదు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించడానికి వచ్చే రైతులు ముందుగానే పట్టా పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ ఖాతాల జిరాక్స్ ప్రతులను నిర్వాహకులకు ఇచ్చి టోకెన్ తీసుకోవాల్సి ఉంటుంది. రైతులు అలా కాకుండా ముందుగా ధాన్యం విక్రయించి తర్వాత డాక్యుమెంట్లు ఇవ్వడం వల్ల డబ్బు చెల్లింపుల్లో కొంత ఆలస్యమవుతుంది. రెండు, మూడు రోజుల్లో మిగిలిపోయిన రైతుల బ్యాంకు ఖాతాల్లో కూడా ధాన్యం విక్రయ డబ్బులు జమ అయ్యేలా చూస్తాం.

– ఇర్ఫాన్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్

జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోళ్ల కేంద్రాలు: 189	ధాన్యం సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నుల్లో): 1,99,050	ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో): 47,000
ధాన్యం విలువ (రూ. కోట్లు): 109	ఇంకా రైతులకు చెల్లించాల్సిన నగదు (రూ. కోట్లు): 20	

అవినీతి నిర్మూలనకు పాటుపడదాం: ఎస్పీ



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్ క్రైం: సమాజంలో అవినీతి నిర్మూలన కోసం పాటుపడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్పీ డి.జానకి అన్నారు. అవినీతి నిరోధక వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం జిల్లా అవినీతి నిరోధకశాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ లైన్ స్కూల్ నుంచి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో పారదర్శకతను పెంపొందించేందుకు పౌరులు అందరూ కలిసి పనిచేయాలన్నారు. అవినీతిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఇలాంటి ర్యాలీలు ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. కార్యక్రమంలో ఏసీబీ సీఐలు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, లింగస్వామి, పాఠశాల హెచ్ఎం శంభుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: త్వరలో జరిగే హెచ్‌సీఏ అండర్–14 ఇంటర్ స్కూల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టును ఈ నెల 7న ఉదయం 10 గంటలకు పిల్లలమర్రి సమీపంలోని మైదానంలో ఎంపిక చేయనున్నట్లు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2010 అక్టోబర్ 1వ తేదీ తర్వాత పుట్టిన వారు ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు వైట్ డ్రెస్, వైట్ షూస్‌తో పాటు ఆధార్‌కార్డు, జనన ధ్రువపత్రంతో హాజరుకావాలని కోరారు.

ఆర్‌ఎన్‌ఆర్ @ రూ.6,859

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం క్వింటా గరిష్టంగా రూ.2,749, కనిష్టంగా రూ.1,856 ధర పలికింది. హంసధాన్యం గరిష్టంగా రూ.2,281, కనిష్టంగా రూ.2,239, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,431, కనిష్టంగా రూ.2,170, వేరుశనగ రూ.6,045 ధరలు వచ్చాయి. దేవరకద్ర మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,682, కనిష్టంగా రూ.2,332గా ధరలు నమోదయ్యాయి. హంస ధాన్యం రూ.2,050 గా ఒకే ధర లభించింది.

రాబోయే రోజుల్లో ఆర్టీసీకి స్వర్ణయుగం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాబోయే రోజుల్లో ఆర్టీసీకి స్వర్ణయుగం రాబోతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్యారంటీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమ్మివేయాలని చూసిందని, కానీ ప్రజా ప్రభుత్వం మాత్రం ఆర్టీసీని బతికించుకోవాలని తాపత్రయం పడుతుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా కేవలం మహబూబ్‌నగర్ డిపో ద్వారానే రూ.కోటి 30 లక్షల మహిళా టికెట్లు ఇవ్వడం చాలా గొప్ప విషయమన్నారు. ఇంకా మెరుగైన వసతులు ప్రయాణ ప్రాంగణంలో కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మహిళలు, చిన్న పిల్లలు, ఫీడింగ్ మదర్స్‌కు ఒక చిన్న రూమ్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉత్తమ సేవలు అందించిన మహిళా కండక్టర్లను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఎం సంతోష్‌కుమార్, డిప్యూటీ ఆర్‌ఎంలు లక్ష్మిధర్మ, శ్యామల, డీఎం సుజాత, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.



బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఆర్‌ఎం సంతోష్

సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలి

- క్రీడల నిర్వహణకు గ్రామ, మండల, జిల్లా కమిటీల ఏర్పాటు
- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ క్రీడలు: ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో సీఎం కప్ పోటీల నిర్వహణ సన్నద్ధతపై జిల్లా అధికారులు, ఎంఈఓలు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాసంఘాలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి జిల్లాకు మెడల్స్ తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామాల్లో, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, 16 నుంచి 21వ తేదీ వరకు జిల్లాస్థాయిలో, ఈ నెల 27 నుంచి వచ్చేనెల 2 వరకు రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో విజేతలు మండలస్థాయికి, మండల విజేతలో జిల్లాస్థాయి, జిల్లా స్థాయిలో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. క్రీడల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో క్రీడల నిర్వహణపై ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని జిల్లా యువజన, క్రీడల అధికారిని ఆదేశించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరూ సీఎం కప్‌కి సంబంధించి ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఏఎస్పీ రాములు, డీఈఓ ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, డీవైఎస్ఓ శ్రీనివాస్, డీపీఓ పార్థసారథి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎస్పీ వెంకటేశ్, క్రీడాసంఘాల ప్రతినిధులు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి, చిత్రంలో అదనపు కలెక్టర్ శివేంద్ర, ఏఎస్పీ రాములు

సర్వే డేటా ఎంట్రీలో తప్పులను సవరించండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీని అధికారులు పరిశీలించి, ఏమైనా తప్పులు ఉంటే సవరించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. గురువారం స్థానిక మయూరి పార్క్‌లోని మీటింగ్ హాల్‌లో తహసీల్దార్లు, ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో కలెక్టర్ సమావేశమై.. సమగ్ర సర్వే, ధరణి, సీఎం కప్ క్రీడల నిర్వహణ, గ్రామపంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటరు జాబితా సవరణకు వచ్చిన దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ వార్డుల వారీగా సర్వే వివరాలు, కుటుంబాల సంఖ్య పరిశీలన చేయాలన్నారు. ఏమైనా తప్పులు ఉంటే సరిచేయాలని అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్‌లో 585 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని పరిష్కరించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చిన ఫారం–6, 7 8 దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 7న ఓటరు ముసాయిదా జాబితా ప్రచురిస్తామని.. 12వ తేదీ వరకు అభ్యంతరాలు, సూచనలు స్వీకరించాలని తెలిపారు. 17న తుది జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక యాప్ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం దరఖాస్తు దారుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు మోహన్‌రావు, శివేంద్ర ప్రతాప్ తదితరులు ఉన్నారు.

ఏసీబీ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బాలకృష్ణ



ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) రెగ్యులర్(పుల్‌చార్జ్) డీఎస్పీగా సీహెచ్ బాలకృష్ణ గురువారం ఏసీబీ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల ఏసీబీ డీఎస్పీగా ఉన్న శ్రీకృష్ణగౌడ్‌ను హైదరాబాద్ సెంట్రల్ జోన్ అదనపు డీసీపీగా బదిలీ చేశారు. కొత్తగా వచ్చిన డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ 1998 బ్యాచ్‌కు చెందిన వ్యక్తి కాగా ఖమ్మంలో ఏసీబీ విభాగంలో సీఐగా పని చేసి పదోన్నతి పొంది డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉండగా ప్రస్తుతం పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఫిర్యాదులు పెరిగే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని, అవగాహన సదస్సులు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసుకోవడానికి ఎవరైనా డబ్బులు అడిగితే తప్పకుండా ఏసీబీ అధికారులను సంప్రదించాలని పిలుపునిచ్చారు.

పంచాయతీల్లో ఆడిట్

- నిధుల వ్యయంపై పారదర్శకత కోసం కొత్త విధానం
- జిల్లాలోని 441 గ్రామాల జమ, ఖర్చు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గ్రామ పంచాయతీల నిధుల వినియోగంలో పారదర్శకత కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా 2023– 24 ఆర్థిక సంవత్సరం ఆదాయ, వ్యయాలపై లెక్కలు తేల్చడంతో పాటు బిల్లులు, వివిధ లావాదేవీలకు చెందిన వివరాలు సరిగ్గా ఉన్నాయో.. లేదో పరిశీలించేందుకు పంచాయతీల్లో ఆడిట్ అధికారులు ఆడిట్‌ను నిర్వహిస్తున్నారు.

మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో..

గతంలో మాన్యువల్‌గా జరిగే ఆడిట్‌ను మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. పంచాయతీల్లో రికార్డుల పరిశీలన పూర్తి కాగానే అదేరోజు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. తద్వారా సవరణలకు గాని మార్పులు, చేర్పులకు గాని అవకాశం ఉండదు. చిన్న పంచాయతీల్లో ఒకేరోజు ఆడిట్ పూర్తి కానుంది. మేజర్ పంచాయతీలు, మండల కేంద్రాల్లో మాత్రం నాలుగైదు రోజుల పాటు ప్రక్రియ కొనసాగే అవకాశం ఉంది.



ధర్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

షెడ్యూల్ ప్రకారం..



గ్రామ పంచాయతీల్లో ఆడిట్ కొనసాగుతుంది. ఆన్‌లైన్ ద్వారా ఆడిట్ జరుగుతుంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. షెడ్యూల్ ప్రకారం ఆడిట్ ప్రక్రియ జరుగుతుంది.

– పార్థసారథి, డీపీఓ

పెరగనున్న పారదర్శకత..

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంఘం, మరికొన్ని ఇతర నిధులు వస్తాయి. వాటిని నిబంధనల మేరకు ఖర్చు చేస్తున్నారా.. లేదా అనేది ఆడిట్‌లో తెలుస్తుంది. గతంలో ఆడిట్ రిపోర్టులు మాన్యువల్‌గా ఇచ్చేవారు దాని ద్వారా తప్పులు చేసినా పెద్దగా బయటపడేవి కాదు. ఆ తర్వాత వారిపై ఎప్పుడో చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం ఈ ఆడిట్‌తో నివేదికలు ఆన్‌లైన్‌లో ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతోపాటు డీపీఓకు కూడా తెలిసిపోతుంది. దీంతో ఏ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందో బహిర్గతమవుతుంది. నిధుల ఖర్చు విషయంలో నిబంధనలు అనుసరిస్తారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటారన్న భయం ఉంటుంది. అదేవిధంగా ప్రభుత్వాలు ఇచ్చే నిధులు పారదర్శకంగా ఖర్చు చేయవచ్చు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: ద్విచక్ర వాహనాన్ని ఓ కారు ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్ఐ శీనయ్య కథనం ప్రకారం.. మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామానికి చెందిన అరవింద్‌గౌడ్(22) తన అమ్మమ్మ గ్రామం అయిన జమిస్తాపూర్‌లో ఉంటూ ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. అయితే బుధవారం రాత్రి 10.20 గంటల ప్రాంతంలో స్కూటీపై జమిస్తాపూర్ నుంచి మహబూబ్‌నగర్‌కు బయల్దేరాడు. మార్గమధ్యంలో పాత ఆర్టీఏ కార్యాలయంలో ఎదుట ఏపీ 22ఎం 5577నంబర్ గల కారు యూటర్న్ తీసుకుంటూ స్కూటీని బలంగా ఢీకొట్టడంతో కిందపడిన అరవింద్ తలకు, కాళ్లు, చేతులకు గాయాలు అయ్యాయి. చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లి.. అక్కడి నుంచి పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజుగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలో పడి రైతు మృతి

బిజినేపల్లి: మండలంలోని సల్కర్‌పేట గ్రామానికి చెందిన కృష్ణయ్య బుధవారం సాయంత్రం బావిలో పడి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. సల్కర్‌పేట గ్రామానికి చెందిన కృష్ణయ్య బుధవారం సాయంత్రం మోటారు కోసం బావిలోకి దిగాడు. ప్రమాదశావత్తు కృష్ణయ్య నీళ్లలో పడి చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబకలహాలతో ఓవ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన జిల్లా కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన కొ్ట్ర నాగరాజు(55) ఇస్త్రీ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు జనరల్ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్ల ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఆశా కార్యకర్త మృతి



లలితమ్మ (ఫైల్)

బల్మూర్: పురుగు మందు తాగిన ఆశా కార్యకర్త చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రేమ్‌నాయక్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని గట్టుతుమ్మెన్‌కు చెందిన ఆశా కార్యకర్త చలమల లలితమ్మ (45) కడుపునొప్పి భరించలేక గత నెల 27న ఇంట్లో పురుగు మందు తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. భర్త శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు. లలితమ్మకు భర్తతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

సర్జఖాన్‌పేటలో మరో వ్యక్తి..



మొగులయ్య(ఫైల్)

కోస్గి: గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ బాలయ్య కథనం మేరకు.. మండలంలోని సర్జఖాన్‌పేట గ్రామానికి చెందిన మొగులయ్య(66) గత నెల 28న సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై కోస్గికి బయలుదేరాడు. ఈజీపూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమైంది. అటుగా వెళ్తున్న కొందరు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ నెల 4న చికిత్స పొందుతూ మొగులయ్య గాంధీ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆయన భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

7 టిప్పర్లు, జేసీబీ పట్టివేత

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామ శివారు నుంచి ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న వాహనాలను నారాయణపేట పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎర్రమట్టితో వెళ్తున్న ఏడు టిప్పర్లు, మట్టిని తోడుతున్న జేసీబీని సీజ్ చేసి పీఎస్‌కు తరలించారు. అంతకుముందు ఆర్ఐ ప్రతాపరెడ్డితో పంచనామా నిర్వహించారు. అనుమతి లేకుండా ఎర్రమట్టిని తరలించడం చట్టారీత్యా నేరమని, సంబంధిత వాహన యజమానులపై కేసు నమోదు చేశారు.

ఆందోళన బాటలో ఆటోవాలా

డిమాండ్ల సాధన కోసం రేపు ఆటోల బంద్

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోతున్నామని ఆవేదన
- ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల డిమాండ్



మహబూబ్‌నగర్‌లో బంద్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆటోవాలాలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రయాణికులు ఆదరించిన రోజు ఎంతో కొంత ఆదాయం. లేకుంటే ఖాళీ జేబులతో ఇంటి బాట పట్టాల్సిందే. రోజు వారీ చిట్టీలు.. నెల వారీ కిస్తులు.. ఇంధనం.. ఇలా ప్రతీది ఖర్చుతో కూడుకున్నదే. అయినా ఆర్టీసీ బస్సులు నడిచీ నడవని మార్గాల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తూ ఆటో డ్రైవర్లు ఉన్నంతలో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం.. ఓలా, ఉబర్, రాపిడో వంటి కంపెనీలు టు వీలర్ల ద్వారా ప్రయాణించే అవకాశం కల్పిస్తుండటంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన చెందుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రకటించిన సమయంలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లను ఆదుకుంటామని చెప్పి.. ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం చేయకపోవడంతో వారు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ, రాష్ట్ర ట్యాక్సీ క్యాబ్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా బంద్ పాటిస్తూ చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు.

రేపు జిల్లావ్యాప్తంగా ఆటోల బంద్..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ 13 డిమాండ్లతో బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా ఆటోల బంద్ పాటించనున్నారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఆటోడ్రైవర్ల ర్యాలీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆటో యూనియన్ నాయకులు తెలిపారు.

ఐఎన్‌టీయూసీ దూరం..

కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీ ఆటోల బంద్‌కు దూరంగా ఉంటుంది. ఆందోళన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం బీఆర్‌టీయూ లీడ్ చేస్తుంది. ఏఐటీయూసీ, బీఆర్‌టీయూ, సీఐటీయూ, టీయూసీఐ, టీఏడీఎస్, యూటీఏడీడబ్ల్యూ కార్మిక సంఘాలు, ఆటో యూనియన్లు మద్దతు తెలుపుతున్నాయి. రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘం, టాక్సీ క్యాబ్ సంఘం జేఏసీగా ఏర్పడి సమ్మెకు పిలుపునిచ్చాయి.

డిమాండ్లు ఇవే..

- ప్రభుత్వ హామీ మేరకు ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ప్రతి సంవత్సరం రూ. 15 వేలు ఇవ్వాలి.
- ఆటో, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.
- గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కొత్త ఆటోలకు పర్మిట్ ఇవ్వాలి.
- ఓలా, ఉబర్, రాపిడో కంపెనీలు నడిపిస్తున్న టు వీలర్లు, ట్యాక్సీలను నిషేధించాలి. ప్రభుత్వమే కొత్త యాప్ తీసుకురావాలి.
- ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి.
- యాక్సిడెంట్ ఎక్స్‌గ్రేషియా రూ. 10లక్షలకు పెంచి, సాధారణ మరణాలకు వర్తింపచేయాలి.
- 50 ఏళ్లు నిండిన ఆటో డ్రైవర్లకు వద్ధాప్య పింఛన్ ఇవ్వాలి.
- అక్రమంగా నడుస్తున్న ఎల్పీజీ, సీఎన్‌జీ, ఇతర జిల్లా ఆటోలను పర్మిట్ నిబంధనలకు అనుగుణంగా నిషేధించాలి.
- కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 2019 మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలి.
- ఆటోలు, క్యాబ్‌లకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలి.
- రాష్ట్ర ప్రభుత్వం ట్యాక్సీ వాహనాలకు యూనిఫామిక్ ఫెయిర్ నిర్ధారణ చేయాలి.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి..



ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో ఆటోవాలా జీవనోపాధి దుర్భరంగా మారింది. ఉచిత బస్సు ప్రయాణం లేనప్పుడు అన్ని ఖర్చులు పోను రోజు రూ. 500 వరకు మిగిలేవి. ప్రస్తుతం గిరాకీ లేకపోవడంతో చాలా మంది వృత్తికే దూరమయ్యారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు ప్రతి సంవత్సరం రూ. 12వేల ఆర్థిక సాయం అందజేయాలి.

– రాజు, ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు

హామీ నెరవేర్చాలి..



ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడినా కనీసం రూ. 800 సంపాదించలేకపోతున్నాం. ఆటో వాలాలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామన్న హామీని ప్రభుత్వం నెరవేర్చాలి. హైదరాబాద్‌లో నిర్వహించే సభకు ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలి.

– నగేష్, ఆటో యూనియన్ జిల్లా నాయకుడు

ఆటోనే మాకు ఆధారం..



మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంతో ఆటోలు నడుపుకొని జీవిస్తున్న మాకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. గతంలో రోజుకు డీజిల్ ఖర్చులు పోను కనీసం రూ. 600కు పైగా వచ్చేది. కానీ ఇప్పుడు రూ.200 కూడా రావడంలేదు. దీంతో ఫైనాన్స్ కిస్తీలు కట్టడం ఇబ్బంది అవుతోంది. ఆటోలనే నమ్ముకుని గత ముప్పై ఏళ్లుగా బతుకుతున్న మాకు ప్రభుత్వం నెలకు రూ. 12వేలు ఇచ్చి ఆదుకోవాలి.

– వీరేష్, ఆటో డ్రైవర్, మహబూబ్‌నగర్

గురుకుల విద్యార్థి భవిష్యత్ ప్రశ్నార్థకం?

- తప్పు చేయకున్నా టీసీ ఇచ్చారని తల్లిదండ్రుల ఆరోపణ
- ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై గురుకుల కార్యదర్శికి ఫిర్యాదు

అచ్చంపేట రూరల్: ఉపాధ్యాయుల తప్పిదంతో ఓ విద్యార్థి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఘటన పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆలస్యంగా వెలుగు చూసింది. విద్యార్థి తల్లిదండ్రుల కథనం మేరకు.. అచ్చంపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. అదే పాఠశాలలో అదే తరగతిలో అదే పేరుతో ఉన్న మరో విద్యార్థి వేరేచోట చోరీలకు పాల్పడ్డాడు. ఆ విద్యార్థిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనూ కేసు నమోదైనట్లు సమాచారం. పేర్లు ఒక్కటే ఉన్నా తండ్రి పేరు వేరుగా ఉన్నాయి. కాని ఉపాధ్యాయులు ఉత్తముడైన తమ కుమారుడిని ఆ విద్యార్థి అనుకొని తోటి విద్యార్థుల ముందు అవమానించారని.. తమ కుమారుడిపై అనుమానంతో గత నెలలో టీసీ ఇచ్చి పాఠశాల నుంచి పంపించారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయంపై గురుకులాల కార్యదర్శికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎలాంటి తప్పు చేయని తమ కుమారుడిపై నిందలు మోపిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తమ కుమారుడి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని.. విద్యా సంవత్సరం ముగుస్తుండటంతో ఏ పాఠశాలలో చేర్పించాలో తెలియడం లేదన్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ అంజయ్యను వివరణ కోరగా.. ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. విద్యార్థి 5వ తరగతి నుంచి పాఠశాలలో చదువుతున్నా... అధికంగా గైర్హాజరయ్యేవాడని, ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పామని తెలిపారు. హౌస్ మాస్టర్ సూచన మేరకు విద్యార్థి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో టీసీ ఇచ్చామని వివరించారు.

ఓబీసీ క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేయాలి



ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఓబీసీలకు క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేయాలని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో జరిగిన ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. జనాభా లెక్కల్లో కులగణన చేయాలని, రిజర్వేషన్లపై 50శాతం పరిమితిని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లలో రిజర్వేషన్‌ను అమలు చేయాలని కోరారు. సీటీఐలో రిజర్వేషన్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. ఓబీసీ సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల(కేటీదొడ్డి) : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని గురువారం సాయంత్రం కేటీదొడ్డి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. వాహనాల తనిఖీల్లో భాగంగా బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు పారుచర్లకు చెందిన సహదేవులుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మహమ్మదాబాద్‌లో ఐదు బస్తాలు..

మహమ్మదాబాద్: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లిగేట్ దగ్గర గురువారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అనుమానాస్పదంగా ఉన్న ఆటోను పరిశీలించారు. అందులో ఐదు బస్తాల రేషన్ ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. సివిల్‌సప్లయ్ అధికారులకు అప్పగించారు. హన్వాడకి చెందిన ఆటో డ్రైవర్ బోగారం కృష్ణయ్యపై కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఆరగిద్దలో గుడిసె దగ్ధం



ఆరగిద్దలో కాలిన గుడిసె

గట్టు: మండలంలోని ఆరగిద్దలో గురువారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తుకు గుడిసె దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నర్సింహులు అలియాస్ బద్రికి చెందిన గుడిసెకు నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఆస్తినష్టం సంభవించింది. నర్సింహులు భార్య పిల్లలతో కొడంగల్‌కు బుధవారం వలస వెళ్లాడు. అప్పుకు సంబంధించి వడ్డీ డబ్బులు రూ.20 వేలు గుడిసెలో పెట్టి, వలస వెళ్లాడు. తెల్లవారు జామున గుడిసెకు నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయింది. గుడిసెలో ఉన్న సైకిల్‌తో పాటుగా 20 వేలు, బోరు పైపులు(నల్లవి), ఫ్యాన్, టీవీ, బియ్యం, వంట సామగ్రి అగ్నికి కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.2.50 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. తాము గుడిసెలోనే ఉన్నామని, ఉద్దేశ పూర్వకంగానే గుడిసెకు నిప్పు పెట్టినట్లు నర్సింహులు ఆరోపించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నల్లబెల్లం, నాటుసారా స్వాధీనం



నాగర్‌కర్నూల్ క్రైం: అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, నాటుసారా, పటికను ఎక్సైజ్ అధికారులు గురువారం జిల్లా కేంద్రంలో స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి తెలిపిన వివరాలు.. మహారాష్ట్ర లాతూరు నుంచి సారాకు వినియోగించే 3వేల కిలోల నల్లబెల్లం, 20కిలోల పటికను, 8లీటర్ల నాటుసారాను పెంట్లవెల్లికి చెందిన రమేష్ తన వాహనంలో అక్రమంగా తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు కొల్లాపూర్ క్రాస్‌రోడ్డులో వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో లభ్యమైన వాటిని స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. రమేష్‌పై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ కళ్యాణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణ, సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్సైలు సృజన, నాగరాజు, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

జడ్చర్ల: ప్రేమ పేరుతో మోసం చేసిన యువకుడిపై గురువారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(22)ని అదే గ్రామానికి చెందిన యువకుడు(26) ప్రేమిస్తున్నానని నమ్మించి గర్భవతిని చేశాడు. ఆసుపత్రికి తీసుకెళ్లి గర్భస్రావం చేయించాడు. అనంతరం మొహం చాటేశాడు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అకాల వర్షం.. అన్నదాత ధైన్యం

- పలు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఇబ్బందులు పడ్డ రైతులు



నారాయణపేట వ్యవసాయ మార్కెట్‌యార్డులో తడిసిన వరి ధాన్యం బస్తాలు

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబెట్టిర వరి ధాన్యం తడిసిపోయింది. నారాయణపేటలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు, గండేడ్ మండలంలో ఆరబెట్టిన ధాన్యాన్ని తరలించేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. మండల కేంద్రంతో పాటు, రుసుంపల్లి, రెడ్డిపల్లి తదితర గ్రామాలు, కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసినట్లు రైతులు తెలిపారు. నారాయణపేట మార్కెట్‌లో సుమారు రెండు వేల బస్తాల ధాన్యం తడిసినట్లు అధికార యంత్రాంగం భావిస్తోంది. మార్కెట్ చైర్మన్ శివారెడ్డి తడిసిన బస్తాలు, ధాన్యం కుప్పలను పరిశీలించారు. టెండర్లు జరిపిన ధాన్యాన్ని శుక్రవారం తూకం వేస్తారని, అమ్మకాలకు రైతులు ధాన్యం తీసుకురావద్దని సూచించారు. కంది కొనుగోళ్లు మాత్రం యధావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

– నారాయణపేట/ గండేడ్/ కొత్తపల్లి



కొత్తపల్లి మండలంలో..



గండేడ్ మండలం రెడ్డిపల్లిలో తడిసిన ధాన్యాన్ని తరలిస్తున్న మహిళలు

కారులో ఉంచిన నగదు దోచేశారు

- రూ.2.20 లక్షలను ఎత్తుకెళ్లిన దుండుగులు

కొత్తకోట రూరల్: కారులో నగదు ఉంచి ఓషాపులో వస్తువులు కొనుగోలు చేసి వచ్చే లోపే రూ.2.20లక్షలు దోచుకెళ్లారు దుండగులు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. అప్పరాల గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి ఇటీవలే వరి ధాన్యం విక్రయించాడు. రూ.8.20లక్షలు రాగా వాటిని తన అన్న, వదిన ఖాతాలకు బదిలీ చేయించాడు. ఈనెల 4న వారి ఖాతాలనుంచి సంగమేశ్వర్ గ్రామీణ వికాస్ బ్యాంక్ నుంచి రూ.2.20లక్షలు డ్రా చేసి గ్రామానికి వెళ్తున్నాడు. భవనమ్మ గుడి సమీపంలో ఓషాపులో వ్యవసాయ పనిముట్లు తీసుకునేందుకు కారు దిగాడు. అతడిని వెంబడిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు కారులో ఉంచిన రూ.2.20లక్షల నగదును దోచుకెళ్లారు. పని ముగించుకుని కారు దగ్గరికి వచ్చిన రవీందర్‌రెడ్డికి డబ్బుల కవర్ కనిపించలేదు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి బ్యాంక్ దగ్గర, ప్రధాన కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

రెండు ఇళ్లలో చోరీ

జడ్చర్ల: తాలూకా క్లబ్ రోడ్డు కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దొంగ చోరీకి పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. మీ సేవ కేంద్రం నిర్వాహకులు రఫిక్ ఇంట్లో రెండు పోర్షన్లలో అద్దెకు ఉంటున్న చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య ఇంటికి తాళం వేసి వెళ్లారు. గురువారం ఇంటి తాళాలు విరగ్గొట్టి ఉన్నాయి. చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.15వేలు, తిరుపతయ్య ఇంట్లో బ్యాగులో ఉన్న అరతులం బంగారం, కడియాలు అపహరణకు గురైనట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించగా గుర్తు తెలియని అగంతకుడు ఇంట్లోకి ప్రవేశించినట్లు గుర్తించారు. 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

పీయూలో క్యాంపస్ సెలక్షన్స్

మహబూబ్‌నగర్‌ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ(పీయూ)లో ఎంబీఏ ఫైనలియర్ విద్యార్థులకు పర్సనల్ బ్యాంకింగ్ సేల్స్ పోస్టులకు సంబంధించి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈసెలక్షన్స్‌కు మొత్తం 26మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి గురువారం ఇంటర్వ్యూలు, త్వరలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, బ్యాంకు ప్రతినిధులు అశోక్‌గౌడ్, శివకుమార్, యోగేశ్వర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి రిమాండ్

లింగాల: మండలంలోని వివిధ వ్యవసాయ పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న స్ప్రింకర్లను, వ్యవసాయ పంపుసెట్లును దొంగతనం చేసిన సంఘటనలో భాస్కర్, రమేష్ అనే వ్యక్తులను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఈ దొంగతనాలలో మరో ఇద్దరు మైనర్లు ఉన్నారని, వారిని జువైనల్ హోం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగొద్దన్న నా ముందే బాటిల్ పెట్టారు..

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: మద్యంతో యువత పెడదోవ పడుతున్నారని.. గ్రామాల్లో బెల్టుషాపులను తీసివేయాలని చెబుతున్న తాను ఇటీవల ఓ ఇంటికి వెళ్తే.. మందు బాటిల్ పెట్టి ఒక పెగ్గు వేయమన్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన ఎమ్మెల్యే.. తనకు ఎదురైన ఘటనను వివరించారు. 'తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత గ్రామాల్లో మద్యం అమ్మకాలు జరగకుండా బెల్టు షాపులను తీసివేసేందుకు అందరూ సహకరించాలని కోరుతున్నా.. ఈ తరుణంలోనే నియోజకవర్గంలోని ఓ నాయకుడి ఇంటికి వెళ్లాను. అక్కడ నా ముందు మందు బాటిల్ పెట్టి ఒక పెగ్గ వేయమనడంతో అవాక్కయ్యాను' అని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

- మీ బంగారం మణప్పురం, ముత్తూట్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694

CHANGE OF NAME

- I, SHAIK ABDUL MAHIMOOD S/o ABDUL SALEEM, R/o H.No. 44-210/1, Ramnagar Colony, Wanaparthy Town & Dist., T.G. hereby changed my name from ABDUL MAHIMOOD S/o ABDUL SALEEM to SHAIK ABDUL MAHIMOOD S/o ABDUL SALEEM.



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్